అనంతపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గంజాయి గూండాలను నియంత్రించండి

పెంచలయ్య హంతకులను శిక్షించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో గంజాయి అమ్మకాలు అత్యంత ప్రమాదంగా మారాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. నెల్లూరు జిల్లాలోని ఆర్డీటీ కాలనీలో జరిగిన సిపిఎం నేత పెంచలయ్య హత్యను అనంతపురం సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా నిరసించింది. పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలని నగరంలోని నీలిమా సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాంభూపాల్‌తో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి మద్యం బెల్ట్‌షాపుల వల్ల శాంతి భద్రతలకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. నెల్లూరు రూరల్ మండల పరిధిలో పెద్ద ఎత్తున గంజాయి మాఫియా అరాచకాలను వాటి వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు తన పాటల ద్వారా ప్రచారం చేస్తున్న సిపిఎం ప్రజానాట్యమండలి నాయకులు పెంచలయ్యను గంజాయి అమ్మకందారులు అత్యంత కిరాతకంగా హత్య చేశారన్నారు. గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చెబుతున్న మాటలను గంజాయి గుండాలు ఏ మాత్రం ఖాతరు చేయడంలేదని ఈ హత్య రుజువు చేసిందన్నారు. రాష్ట్రంలో గంజాయిని లేకుండా చేస్తామని నోటితో చెబుతూ చేతుల్లో బెల్ట్ షాపులు, బ్రాందీ షాపులను పెంచడం దేని సంకేతం అని ప్రశ్నించారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి అమ్మకాలు పెరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. గంజాయి అమ్ముతున్న వారినపై పోలీసులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లనే నెల్లూరులో పెంచలయ్య హత్యకు గురయ్యాడన్నారు. పోలీసులపైనే దాడులు చేసే స్థాయికి గంజాయి గూండాలు వెళ్లారంటే వారికి రాజకీయ అండదండలు ఎంత బలంగా వున్నాయే అర్థమవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచలయ్య నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ పెంచలయ్య హత్య అత్యంత దుర్మార్గం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ హత్య జరిగిందన్నారు. హత్య చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, బి.శ్రీనివాసులు, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు వి.నిర్మల, టి.రామాంజనేయులు, నగర నాయకులు వలి, ఇర్ఫాన్, మసూద్, ప్రకాష్ రెడ్డి, నాయకులు చంద్రిక, అశ్విని, రాజా పాల్గొన్నారు.

సమాజానికి మూలం సైన్స్.. సైన్స్ లేనినిదే సమాజం లేదు.! మానవ పరిణామ క్రమం అభివృద్ధి చెందడంలో సైన్స్ కీలకపాత్ర పోషించింది. అభివృద్ధి చెందిన సైన్స్ మనిషి, మానవ సమాజం ఎదిగేందుకు దోహదం చేసింది. సైన్స్ గొప్పదనాన్ని తెలియజేస్తూ జెవివి నిరంతరం సమాజంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల స్థాయి చెకుముకి పరీక్షలను నిర్వహించింది. సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆశక్తి, ఆలోచను పెంచడంతో పాటు వారిని ప్రోత్సహించింది. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తూ సైన్స్ గొప్పతనాన్న విద్యార్థులకు తెలియజేస్తోంది.

చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో జెవివి నాయకులు

చెకుముకి సంబరం..

ఆలోచనలు ఆవిష్కృతం..!

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెకుముకి సంబరాలు
- జెవివి ఆధ్వర్యంలో సైన్స్‌పై పరీక్షలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- పలువురు రాష్ట్ర స్థాయికి ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత 35 ఏళ్లుగా విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక(జెవివి) హితోదికంగా కృషి చేస్తోంది. విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం పెంపొందించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తోంది. సమాజంలో నెలకొన్న అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానం వైపు నడిపించేందుకు జెవివి తమ వంతుగా కృషి చేస్తోంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించేలా చేయడం సైన్స్‌పై ఆసక్తిని కల్పించడం, అలవర్చుకోవడం ద్వారానే సృజనాత్మకత పెరుగుతుంది అనే ఉద్దేశంతో సైన్స్ అంశాలతో కూడిన మాస పత్రికను నడపడంతో పాటు చెకుముకి సంబరాలను నిర్వహిస్తోంది.

చెకుముకి సంబరాలు నేపథ్యం ఇలా...

రాష్ట్రంలోని పలువురు మేధావులు, అభ్యుదయ ప్రముఖులు 1988 ఫిబ్రవరి 28న జన విజ్ఞాన వేదికను స్థాపించారు. విద్యార్థి చెకుముకి పేరుతో 1990 డిసెంబర్ నుంచి సైన్స్ అంశాలతో కూడిన టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాపారమయమైన టాలెంట్ టెస్ట్ సంస్కృతిని వ్యతిరేకిస్తూ 2010 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలుగా చేస్తున్నారు. నేర్చుకున్నది గుర్తుండి పోవడం కాకుండా, ఆచరించగలగడమే గీటురాయి అని చెబుతూ ఈ సంబరాలను జరిపిస్తున్నారు. రాత పరీక్షతోపాటు క్విజ్, శాస్త్రవేత్తలతో విద్యార్థులను మమేకం చేసే దిశగా కార్యక్రమాలను జెవివి రూపొందిస్తూ ముందుకు సాగుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెకుముకి సంబరాలు

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రశ్నాపత్రం తయారు చేసి పరీక్షలు రాయించారు. విద్యార్థి దశ నుంచే ఆలోచింపజేసేలా ఈ పరీక్షలను నిర్వహించారు. ఇందులో భాగంగా నవంబర్ 23వ తేదీన జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. అందులో భాగంగానే అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చెకుముకి పరీక్షలు జరిగాయి. 23వ తేదీ ఆదివారం పుట్టపర్తి సాయిబాబా 100వ జయంతి కారణంగా భారత రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు స్థానికంగా జరిగిన పెళ్లి వేడుకలకు హాజరయ్యేందుకు వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లాకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా జనం రద్దీ కన్పించింది. ఇలాంటి సమయంలో చెకుముకి సంబరాలకు ఇతర మండలాల నుంచి విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారా అనే సందేహం నెలకొంది. అంత రద్దీ ఉన్నా విద్యార్థులు, వారి తల్లిండ్రులు వాటిని లెక్కజేయకుండా వంద కిలోమీటర్ల దూరం పైబడి ఉన్న గుత్తి, గుంతకల్ ప్రాంతాల నుంచి కళ్యాణదుర్గంకు వచ్చి పరీక్షలు రాశారు. 20 మండలాల నుండి 18 ప్రభుత్వ పాఠశాలలు 8 ప్రయివేటు పాఠశాలలను కలుపుకుని మొత్తం 26 జట్లు, జట్టుకు ముగ్గురు చొప్పున 78 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విభాగంలో గుమ్మగట్ట మండలం విద్యార్థుల ప్రతిభ

ప్రభుత్వ హైస్కూల్స్ విభాగం నుంచి జిల్లాలోని మారుమూల ప్రాంతమైన గుమ్మగట్ట మండలం గోనబావి మహాత్మ జ్యోతి రావు పూలే బీసీ గర్ల్స్ రెసిడెన్షియల్ హై స్కూల్ 8,9,10వ తరగతి విద్యార్థునిలు ప్రతిభ చాటారు. ఎస్.వర్షిని, సి.నిహారిక, ఎన్.శ్రీలక్ష్మిలు పోటీలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారు.

ప్రయివేటు పాఠశాలల విభాగం నుంచి మాంటిస్సోరీ విద్యార్థులు

ప్రయివేటు స్కూల్స్ విభాగం నుంచి రాప్తాడు మండలం గొల్లపల్లి మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన 8,9,10వ తరగతి విద్యార్థులు ప్రతిభచాటారు. ఎ.సాయి చరిత, పి.సుదర్శన్ రెడ్డి, పి.అమరేశ్వర్ రెడ్డిలు పోటీలో పాల్గొని ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

కాకినాడలో రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు

డిసెంబర్ 21,22,23వ తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కాకినాడలో జరుగనున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి చెరో జట్టు చొప్పున పాల్గొంటాయి. అనంతపురం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన గుమ్మగట్ట, రాప్తాడు మండలానికి సంబంధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

శాస్త్రీయ దక్పథం పెరగాలి

శాస్త్రీయ దక్పథం, మానవతావాదం, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవడం ప్రతి పౌరుడి విధి. ఇదే విషయాన్ని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 చెబుతోంది. నేటి బాలులే రేపటి పౌరులు కాబట్టి వారిని శాస్త్రీయ దక్పథం వైపు నడిపించేలా ప్రభుత్వాలు కషి చేయాలి. సైన్స్‌ను తెలియజేస్తూ ప్రశ్నించే తత్వాని విద్యార్థుల్లో పెంచాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వాలు విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలి.

డా॥ఎం.గేయానంద్,
మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు.

సైన్స్ ఆవశ్యకతను తెలియజేయాలి

విద్య చుట్టూ అల్లుకున్న మార్కులు, గ్రేడులు పోటీల సంస్కృతి విద్యార్థుల్ని డొల్లగా మారుస్తోంది. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, పక్కవారిని గురించి ఆలోచించడం, ఆధునిక దక్పథాన్ని సంతరించుకోవడం లాంటివి ఈ కాలం పిల్లలకు విద్యాసంస్థల్లో దూరం అయ్యాయి. ఈ పరిస్థితుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకతను వెలికి తీసేందుకు జెవివి కృషి చేస్తోంది.

కె.వీరరాజు,
జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి.

కళ్యాణదుర్గం ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సంబరాల కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మోటార్ వాహనాలు ఇన్స్పెక్టర్ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి ఆధ్వర్యంలో విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో స్థానిక బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో వాహనదారులకు ఉచితకంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వాహన యజమానులకు, డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ మదన్ కుమార్, కిషోర్ కుమార్ రెడ్డి, నామ రఘు మాట్లాడుతూ కంటి చూపు పట్ల వహించవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. విజన్ ప్లస్ ఆసుపత్రి వైద్యులు మాధవరెడ్డి, జవహర్ బాషా లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వాహనాలు ఇన్స్పెక్టర్ రాజేష్, రోటరీ క్లబ్ సభ్యులు పచ్చి పులుసు రాఘవేంద్ర, మహేష్ రెడ్డి , మట్ట రాజీవ్ ,రాజశేఖర్ రెడ్డి మరియు స్థానిక లారీ,ఆటో, ఎల్‌జివి అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిల్లకొండయ్యపల్లిలో చీనీచెట్లు నరికివేత

ప్రజాశక్తి-తాడిమర్రి

ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అలజడి రేగింది. కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవిస్తున్న చిల్లకొండయ్యపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఓ రైతుకు చెందిన చీనీ చెట్ల నరికివేత ఘటన తీవ్ర కలకలం రేగింది. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు కొంక తిరుపాలు సర్వే నంబర్ 24లో తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో ఐదు సంవత్సరాల క్రితం సుమారు 300 చీనీ చెట్లను సాగు చేశారు. ఐదేళ్లపాటు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా చెట్లను కాపాడుకుంటూ వచ్చాడు. పంట చేతికి వస్తున్న సమయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పొలంలోని 59 చీనీ చెట్లను నరికి వేశారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు తిరుపాలు నరికివేతకు గురైన చీనీ చెట్లను చూసి కన్నీటి పర్యవంతం అయ్యాడు. పంట చేతికి వస్తే చేసిన అప్పులుతీర్చవచ్చని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆయన ఈ ఘటనలో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. చీనీ చెట్ల నరికివేత విషయం తెలుసుకున్న పోలీసులు పొలంలో పర్యటించి బాధిత రైతుతో వివరాలు సేకరించారు.

నరికివేతకు గురైన చీనీచెట్లు

అప్పులు చేసి పంటలు సాగు చేశాం
రైతు తిరుపాలు

ఐదేళ్ల పాటు ఎంతో శ్రమకోర్చి అప్పులు చేసి చీనీ తోటలను సాగు చేశానని, ఇప్పుడు వాటిని నరికివేయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతు తిరుపాలు, అతని భార్య చంద్రకళ కన్నీటి పర్యవతం అయ్యారు. తమ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా తన భూమి సర్వేనెంబర్ 80లో తక్కువ ఉందన్న కారణంతో మండల సర్వేయర్ ద్వారా సర్వే చేయించానన్నారు. ఈ సర్వేలో తన పొలం సమీపంలోని ఓ రైతు భూమిలోకి తన భూమి ఉన్నట్లు తేలిందన్నారు. ఈ సమయంలో ఈ రైతును భూమి ఇవ్వాలని కోరగా అతను ఒప్పుకోలేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు విమర్శలు చేసుకున్నామన్నారు. భూమికి సంబంధించిన దారి విషయంలో గత కొలంగా సమస్య నడుస్తోందన్నారు. సమస్యను మండల రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలియజేశామన్నారు. వారు ఏకపక్షంగా వ్యవహరించి తమకు అన్యాయం చేయాలని చూశారన్నారు. ఈ సమయంలో సమస్య పరిష్కారం కాకుండా ఘర్షణలకు కారణం అయ్యిందన్నారు. అందులో భాగంగానే తామంటే గిట్టనివారు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసుల ఎదుట బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి తమకు జరిగిన అన్యాయం గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

భూముల రీసర్వేతో ప్రయోజనం

సర్వే శాఖ ఏడీ విజయశాంతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

"ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం రేకూరుతుంది. ప్రభుత్వం పాదదర్శకంగా రీ సర్వేను చేస్తోంది. అన్నదమ్ముల మధ్య భూ వివాదాలు, ఆక్రమణలు, సాగు ఒకరు.. భూ రికార్డుల్లో మరొకరు తదితర – సమస్యలన్నీ రీ సర్వేతో పరిష్కారం అవుతాయి". అని శ్రీ సత్యసాయి జిల్లా సర్వే శాఖ ఏడీ విజయశాంతి తెలియజేశారు. జిల్లాలో చేస్తున్న రీ సర్వే పనులపై ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: జిల్లాలో భూ విస్తరణం ఎంత.? గతంలో ఎన్ని ఎకరాలు, ఎన్ని గ్రామాల్లో సర్వే చేపట్టారు.?

ఏడీ:జిల్లాలో మొత్తం 20,91,976,25 ఎకరాల భూమి ఉంది. 32 మండలాల్లో మొత్తం 461 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో 161 గ్రామాల్లో 4,02,857, 9 ఎకరాలు రీ సర్వే జరిగింది. మొదటి విడతలు జిల్లాల 32 గ్రామాలు రెండో విడతలు 23 గ్రామంలో మొత్తం సర్వే పూర్తయ్యింది. మూడవ విడత ఒక గ్రామంలో 1.06 లక్షల ఎకరాల్లో సర్వే జరిగింది. రీ సర్వే జరిగిన వాటికి పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు రైతులకు అందిస్తారు.

ప్రశ్న. సర్వేలో ఏఏ అధికారులు పాల్గొంటున్నారు..? వాటి వివరాలు ఏమిటి.?

ఏడీ :సర్వేలో ప్రధానంగా సచివాలయంలోని గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, డిప్యూటీ తహశీల్దార్లు మండల సర్వేయర్లు పాల్గొంటారు. జిల్లాలో మొత్తం 355 మంది గ్రామ సర్వేయర్లు ఉన్నారు. వీరంతా సర్వేలో కీలకంగా ఉంటారు. మొదట విలేజీ బౌండరీ తర్వాత ఆయా గ్రామాల రెవెన్యూ పొలంకు సంబంధించిన రికార్డులు ఆయా రైతుల పట్టాదారు పుస్తకాలు ఆధారంగా సర్వే చేస్తారు.

ప్రశ్న : రైతుల మధ్య భూ తగాదాలను ఎలా పరిష్కరిస్తారు.?

ఎడి: ప్రధానంగా అన్నదమ్ముల భూమి తగాదాలు, సాగులో ఒకరు ఉంటే రికార్డులో మరొకరు ఉంటారు. భూ ఆక్రమణల సమస్యలూ ఉంటాయి. కోర్టు కేసుల్లోనూ భూ సమస్యలుంటాయి. ఇలాంటి వాటికి రీ సర్వేద్వారా పరిష్కారం దొరుకుతుంది. సమస్య ఉన్న ఇద్దరి సమక్షంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం. దీని వల్ల భూ వివాదంకు ముగింపు పలికే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: భూ సమస్యలు రీ సర్వేతో పరిష్కారం అవుతాయా.?

ఎడి విజయశాంతి

ఎడి: బ్రిటిష్ పాలనలో చేసిన సర్వే ఆధారంతోనే ఇప్పటివరకు భూ రికార్డుల్లో ఉ న్న మేరకు చేస్తున్నాం. ఎంతో మంది రైతులు వివాదాల సమస్యలతో సతమతం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిగా భూ ప్రక్షాళనకు రీసర్వే ద్వారా పరిష్కారం చూపించే ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న 1.06 లక్షల ఎకరాల భూ సర్వే డిసెంబర్ 16కు పూర్తి చేయలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. సర్వే అనంతరం ఆయా రైతుల భూములకు హద్దులు చూపించడం, రాళ్ల పాతడం వివాదాలు ఏమీ లేకుండా ఆ రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తాం.

ప్రశ్న: రీ సర్వేపై రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

ఎడి: సర్వే చేసే సమయంలో సర్వే రెవెన్యూ సిబ్బందికి ఆయా గ్రామాల్లో రైతులు ప్రజలు సహకరించాలి. ప్రజల ముంగిటకే ప్రభుత్వ యంత్రాంగం కదిలి వచ్చి రైతుల భూ సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

కార్పొరేషన్ రుణాలు అందేనా..?

- రుణాల మంజూరుపై అయోమయం
- ఉమ్మడి జిల్లాలో ఐదువేల యూనిట్లు ఇస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటనలు
- ఇంటర్వ్యూలు నిర్వహించి చేతులు దులుపుకున్న సర్కార్

రుణాలకోసం దరఖాస్తు చేయడానికి వచ్చిన ప్రజలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

సంక్షేమం, అభివృద్ధి తమకు రెండు కళ్లు..గత వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్‌సి, ఎస్‌టీ, బిసి, కాపు, మైనార్టీ కింద రుణాలు మంజూరు చేసి అర్హులైన యువతి, యువకులకు ఉపాధి కల్పిస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంవత్సరానికి ముందే నోటీపికేషన్ ఇవ్వడంతో పాటు ఇంటర్వ్యూలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు మాత్రం మంజూరు చేయలేదు.

ప్రభుత్వం ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుపై వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు విమర్శిస్తున్నారు.కార్పొరేషన్ రుణం మంజూరైతే ఉపాధి దొరుకుతుందని ఎదురుచూస్తున్న వేలాది మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, బిసి, కాపు సామాజిక తరగతులను మోసం చేసిందంటూ కూటమి నేతలు ఎన్నికల్లో విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే మళ్లీ కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో ఒక్క హిందూపురం పురపాలక సంఘంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా 146 యూనిట్లు మంజూరు చేయగా 1355 మంది నిరుద్యోగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో బీసీ కార్పొరేషన్‌కు 120 యూనిట్లకు గాను 1133 దరఖాస్తులు, కాపు కార్పొరేషన్ కింద 11 యూనిట్లకు గాను 149 దరఖాస్తులు, ఈ బీసీ కింద 9 యూనిట్లకు 73 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 20వ తేదీన పురపాలక సంఘ కార్యాలయం ఆవరణంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదే విధంగా అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల్లో బిసి కార్పొరేషన్ కింద దాదాపు 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద దాదాపు 1,387 యూనిట్లు, ఇడబ్ల్యూఎస్ కోటా కింద దాదాపు 215 యూనిట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలు సైతం ఇచ్చారు. దరఖాస్తుల స్వీకరణ సైతం చేపట్టారు. దాదాపు 25 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తేల్చారు. దరఖాస్తుదారులకు పురపాలక సంఘ కార్యాలయాల్లో, మండల పరిషత్ కార్యలయ ఆవరణంలో బ్యాంక్ అధికారులతో కలిసి అధికారులు ఇంటర్వ్యూల ప్రక్రియ సైతం పూర్తి చేశారు. ఇంకేముంది కార్పొరేషన్ రుణం వచ్చేసినట్లే అని అంతా అనుకున్నారు. అదే సమయంలో ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. మే 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దాదాపు మూడు వేల దరఖాస్తులు వరకూ వచ్చినట్లు లెక్కలు వేశారు. ఏం జరిగిందో, ఏమో తెలీదు హఠాత్తుగా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం నిలిపివేసింది. ఎందుకు నిలిపివేశారో కారణాలు సైతం చెప్పలేదు. సాంకేతిక కారణాల వల్ల నిలిపివేసినట్లు చెబుతూ మసిపూసి మారేడు కాయ చేశారు.కార్పొరేషన్ రుణాల ప్రక్రియను నిలిపివేసి దాదాపు 6 నెలలు కావస్తోంది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకుండా పోయింది.

రుణాల మంజూరుపై అనుమానాలు

గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క కార్పొరేషన్ రుణమూ ఇవ్వలేదు. ఎస్‌సి, బిసి, కాపులకు అందిన సంక్షేమ పథకాల సొమ్మును లెక్కలు చెబుతూ మభ్యపెట్టేందుకు ప్రయత్నించింది. దీంతో ఆయా సామాజిక తరగతుల నుంచి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కార్పొరేషన్ రుణాలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు సైతం వెల్లువెత్తాయి. 2019కు ముందు పాలించిన ప్రభుత్వాలు కార్పొరేషన్ రుణాలకు పెద్దపీట వేస్తూ వచ్చాయి. దీంతో ఎన్నో కుటుంబాలు వ్యాపారాలకు సంబంధించిన యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాయి. ఇన్నోవా కార్లు వంటివి సైతం కార్పొరేషన్ రుణాల కింద మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ కార్పొరేషన్ రుణాలపై అంతా ఆశలు పెట్టుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినట్లే ఇచ్చి ప్రభుత్వం నిలిపివేసింది. సబ్సిడీపై కార్పొరేషన్ రుణం వస్తే యూనిట్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చునని వేలాది మంది ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17నెలలు దాటిపోయింది. ఇప్పటి వరకూ కార్పొరేషన్ రుణాల వ్యవహారం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్ రుణాలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని మంజూరు చేయాలని వేలాది మంది కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎస్‌సి, బిసి, కాపు సామాజిక తరగతుల్లోని యువతకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.

సర్వమత సమ్మేళనం... బాబయ్య ఉరుసు

పెనుకొండ బాబయ్య సమాధిజవ

రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
2న గంధం వేడుకలు
దేశ,విదేశాల నుంచి హాజరు కానున్న వేలాది మంది భక్తజనం
సర్వం సిద్ధం చేసిన అధికారులు, దర్గా నిర్వాహకులు

ప్రజాశక్తి-పెనుకొండ

దక్షిణ భారతదేశం లోనే ప్రసిద్ది గాంచిన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ శ్రీ బాబయ్య స్వామి దర్గా సర్వమత సమ్మేళనం, మత సామరస్యానికి నిదర్శనంగా నిలిచింది. హిందూ ముస్లిం అనే తేడా లేకుండా దర్గాలోని బాబయ్య స్వామి సమాధిని దర్శించుకుంటారు. ప్రతి ఏటా నిర్వహించే ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది ఈనెల 2న బాబయ్య స్వామి 753 వ ఉరుసు మహోత్సవాలు దర్గా పీఠాధిపతి కె.యస్.యస్.బి. సలావుద్దీన్ హైసైని సాహెబ్, ముత్తవల్లి, మాజీ పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించన్నున్నారు. ఈ క్రమంలోనే డిసెంబర్ 2 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14 రోజుల పాటు పెనుకొండలో బాబయ్య స్వామి ఉరుసు నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. ఇప్పటికే దర్గాను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సర్వమతాల సారాంశం ఒక్కటేనని చాటి చెప్పిన బాబయ్య స్వామి స్ఫూర్తితో ఉత్సవాల రోజున దర్గాలో సర్వమత సమ్మేళనం నిర్వహిస్తుంటారు.

బాబయ్యస్వామి చరిత్ర..

బాబాఫకృద్దీన్ జన్మస్థలం ఇరాన్ దేశంలోని శిస్థాన్ పట్టణం. సుల్తాన్ సయ్యద్ హుస్సేన్, సయ్యదా బాబా ఫాతిమా దంపతుల హజరత్ బాబా ఫక్రు ద్దీన్ రహమతుల్లాఅలై (బాబయ్య) 12వ శతాబ్దానికి చెందిన వారు ఈయన రాజ్యపాలన చేస్తున్న సమయంలో ఓ రోజు న్యాయం కోసం వచ్చిన బాధితులను నిర్లక్ష్యం చేస్తారు. ఆ తప్పునకు పశ్చాత్తాపంగా మత గురువుల ఆదేశానుసారం రాజ్యాన్ని త్యజించి దేశాటనకు వెళ్లారు. మక్కా, మదీనా, ఆఫ్ఘ నిస్తాన్, కాశ్మీర్, గుజరాత్ తదితర ప్రాంతాల మీదుగా తమిళనాడులోని తిరుచనాపల్లికి వస్తారు. అక్కడ హజ్రత్ సత్తేహార్ తబ్రే ఆలం బాద్‌ను గురువుగా స్వీకరిస్తారు. పెనుకొండకు వెళ్లి సర్వమానవ సౌభ్రాతృత్వం, శాంతి, సామరస్యం గురించి ప్రజలకు బోధించాలని ఆజ్ఞాపిస్తారు. ఈ క్రమంలో బాబా దేశాటన చేస్తూ కర్నాటక, తమిళనాడు లో పలు ప్రాంతాలు తిరిగారు. పెనుకొండకు చేరుకుని ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆయన ఇక్కడ ఉండటానికి హిందూ మత పెద్దలు వ్యతిరేకిస్తారు. ఈ విషయం రాజు దృష్టికి వెళ్లడంతో బాబాకు హిందూ మత పెద్దలకు మధ్య పోటీ నిర్వహిస్తారు. ఈ పోటీలో బాబాయ్య స్వామి విజయం సాధించి మండపాన్ని స్థిర నివాసంగా పొందుతారు. బాబయ్య స్వామిగా ఖ్యాతి పొందిన బాబాఫకృద్దీన్ క్రీ.శ 694లో పరమపదించారు. ఆ స్థలంలోనే బాబాను సమాధి చేశారు. ఆయన సమాధే ప్రఖ్యాతి చెందిన శ్రీబాబయ్యస్వామి దర్గా.

పీఠాధిపతి సలావుద్దీన్ హైసైని సాహెబ్

మాజీ పీఠాధిపతి తాజ్‌బాబా

2న రాత్రి గంధం వేడుకలు

డిసెంబర్ 2న (మంగళవారం) రాత్రి 1 గంట అనంతరం బాబయ్య స్వామి గంధం వేడుకలు ప్రారంభం కానున్నాయి. అంతకు ముందు మొదటి గంధం వేడు కలు నిర్వహిస్తారు. మొదటి గంధాన్ని పీఠాధిపతి సజ్జద్ బాబా రాత్రి 10 గంటల ప్రాంతంలో తన ఇంటి నుంచి గంధాన్ని కుటుంబసభ్యులు, భక్తుల కోలా హలం మధ్య దర్గాకు చేర్చి స్వామి సమాధికి సమర్పిస్తారు. ఆ తర్వాత రాత్రి 1 గంట సమయంలో దర్గా పీఠా ధిపతి సలావుద్దీన్ హైసైని సాహెబ్, ముత్తవల్లి,మాజీ పీఠాధిపతి తాజ్ బాబా తన ఇంటి వద్ద నున్న చందన్ మహల్ నుంచి వేలాది మంది భక్తులు, ఫక్కీర్లు వెంటరాగా కోలాహలంగా గంధాన్ని తలపై మోసుకుని తీసుకెళ్లి స్వామి సమాధికి సమర్పిస్తారు. అంతకు ముందు సర్వమత సమ్మేళ నాన్ని తాజాబాబా ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

సౌకర్యాలు ఏర్పాటు చేసిన అధికారులు, దర్గా నిర్వాహకులు

ఉరుసుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అనిసౌకర్యాలను ఏర్పాట్లు చేశారు. ఈ గంధం మహోత్సవానికి ఆంధ్రా, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల నుండే కాకుండా సింగపూర్, దుబాయ్ తదితర దేశాల నుండి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. ఈ ఉరుసు కార్యక్రమంలో ఎక్కడ కూడా కొట్లాటలు, దొంగతనాలు, మోసాలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని రాళ్ల అనంతపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన ఓబుళపతి తన తల్లి రాములమ్మతో కలసి ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో ధర్మవరం సమీపంలోని ఓ గ్రామానికి బయలుదేరాడు. రాళ్ల అంతపురం క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాములమ్మ (65) అక్కడికక్కడే మృతిచెందింది. ఓబుళపతికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రయివేటు పాఠశాలల సంఘం నాయకులు

ప్రభుత్వం దృష్టికి ప్రయివేటు పాఠశాలల సమస్యలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.ఆదివారం పట్టణంలోని షిరిడీ సాయి స్కూల్‌లో కదిరి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు , అధ్యక్షులు పలవల అనిల్ కుమార్ రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా సిఆర్ఓ కోటిరెడ్డి రవిచంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకుందామని తెలియజేశారు. ఇటీవలే డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డు అందుకున్న జిల్లా అధ్యక్షులు పలవల పవన్ కుమార్ రెడ్డి సన్మానించారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి గీత, ఉపాధ్యక్షులు వనజావాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ మూర్తి, ఉపాధ్యక్షులు జాహ్నవి, ఉపకార్యదర్శి విశ్వేశ్వర్ రెడ్డి, కదిరి డివిజన్ గౌరవాధ్యక్షులు సలీం భాష, అధ్యక్షులు సురేష్ కుమార్, సభ్యులు సాదిక్ భాష, కార్యదర్శి శంకర్ రెడ్డి, కోశాధికారి అలీమ్ భాష,అనంతపురం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి ఎలుగుబంట్లు
భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - రొళ్ల

మండలంలోని పలు గ్రామాల్లోకి ఎలుగుబంట్లు వస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని హెచ్‌టి హళ్లి, టీ.హల్లి వడ్రహట్టి, జీర్గేపల్లి, మల్లినమడుగ తదితర గ్రామాల్లో రాత్రివేళల్లో ఎలుగుబంట్లు సంచరించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఈ గ్రామాలు కొండకు సమీపములో ఉన్నందున కొండల్లో ఉన్న ఎలుగుబంట్లు చీకటి కాగానే గుంపు గుంపులుగా బోరుబావుల వద్దకు వస్తున్నాయని తిమ్మరాజు అనే రైతు చెప్పారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు రావాలంటే తీవ్ర భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకొని ఎలుగుబంట్ల నుంచి గ్రామస్తులను కాపాడాలని కోరుతున్నారు.

టెట్ నుంచి మినహాయించాలి : యుటిఎఫ్

కరపత్రాలను ప్రదర్శిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

2010 కంటే ముందే నియమితులై ఇన్ సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆర్. రామకృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ధర్మవరం పట్టణంలోని పాండురంగ వీధిలో ఉన్న యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలోపు టెట్ పరీక్ష ఉత్తీర్ణత కావాలని, అలా కాని పక్షంలో వారిని సర్వీసు నుండి తొలగించాలని విద్యాహక్కు చట్టంలోని క్లాజ్ 23(1) ప్రకారం సుప్రీంకోర్టు సెప్టెంబర్ 1 వ తేదీన తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పు వల్ల దేశం మొత్తం మీద లక్షలాది మంది ఉపాధ్యాయులు (మన రాష్ట్రంలో సుమారు లక్ష మంది సీనియర్ ఉపాధ్యాయులు) ఇబ్బందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి వస్తుందని అన్నారు. టెట్ పరీక్షను విద్యాహక్కు చట్టం ప్రకారం 2011 నుండి తప్పనిసరి చేశారని, అప్పటి నుండి టీచర్ వృత్తిని పొందడానికి అభ్యర్థులు టెట్ పరీక్షల్లో క్వాలిఫై అయి ఉపాధ్యాయులుగా నియమితులు అవుతున్నారని చెప్పారు. ఐతే 2011 కంటే ముందు నియమితులై 20, 30 సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఇది వర్తింపచేసేలా తీర్పు రావడం వల్ల వారినందరినీ మానసిక ఒత్తిళ్లకు గురిచేసినట్లు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్ , పి సురేష్, సాయి గణేష్, హెచ్ రామాంజనేయులు, కృష్ణ తేజ, వెంకట కిషోర్, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగళి ఎస్ఐగా శోభారాణి

ఎస్ఐ శోభారాణి

ప్రజాశక్తి - అగళి

అగళి ఎస్ఐగా శోభారాణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. శోభారాణి నంద్యాల స్టేషన్ నుండి ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం ' : మాజీ ఎంపీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కాంగ్రెస్‌పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎఐసిసి అబ్జర్వర్ అజయ్ సింగ్, పిసిసి అబ్జర్వర్లు తులసీరెడ్డి, కమలమ్మ, డిసిసి అధ్యక్షులు ఇనయతుల్లా అన్నారు. ధర్మవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రాధాన్యతను వివరించారు. అలాగే పార్టీ బలోపేతానికి ఆచరిస్తున్న విధానాలు, పార్టీ అనుబంధ సంఘాల ఏర్పాటుకు, పార్టీ ప్రక్షాళన గురించి చర్చించారు. త్వరలోనే నూతన కార్యవర్గాలు ఏర్పడుతాయని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ నిసార్ మొహ్మద్, నాయకులు కాటమయ్య, యూత్ కాంగ్రెస్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాకేంద్రం పుట్టపర్తితో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చని చెప్పారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

చిన్నపాటి వైద్యమైనా మడకశిరకు రెఫర్

స్టాఫ్ నర్సుతోనే ఆసుపత్రి నిర్వహణ
కన్పించని వైద్యులు.. ఇబ్బందుల్లో ప్రజలు
అమరాపురం ప్రభుత్వ ఆసుపత్రి తీరు

ప్రజాశక్తి - అమరాపురం

మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. చిన్నపాటి వైద్యానికి కూడా మడకశిరకు రెఫర్ చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండటం లేదని స్టాఫ్ నర్సుతోనే ఆసుపత్రి నిర్వహణ సాగుతోందని రోగులు ఆరోపిస్తున్నారు. అమరాపురం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం ఇద్దరు వైద్యులను నియమించింది. ఆ ఇద్దరు వైద్యులు ఆసుపత్రిలో వైద్యసేవలు అందించడానికి అందుబాటులో ఉండటం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. 24/7 స్టాఫ్ నర్స్‌తో ఆసుపత్రి నిర్వహణ సాగుతోంది. ఈ ప్రాథమిక వైద్య కేంద్రంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఒక ఫార్మసిస్టు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక సబార్డినేటర్ ఉన్నారు. మండలంలో ఎఎన్ఎంల కొరత ఉంది. ఐదు పోస్టులు ఖాళీగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాలఈలో వైద్య సేవ చేయడానికి చాలా ఇబ్బందిగా ఉందని మెడికల్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇక మండలంలో ఏచిన్న వైద్యసేవకు కూడా మడకశిరకు రెఫర్ చేస్తుంటారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యసేవల విషయంలో మండల కేంద్రంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి 24 గంటలు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కదిరి కోఆర్డినేటర్‌ను తొలగించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్చార్జి షాన్‌వాజ్‌ను వెంటనే తొలగించాలని ఆపార్టీ స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నాయకులు అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆదివారం కదిరిలో ఎఐసిసి పరిశీలకులు అజయ్ సింగ్ వాహనాన్ని అడ్డుకున్నారు. సమస్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిసిసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కే ఇందాదుల్లా ఖాన్, పిసిసి జనరల్ సెక్రెటరీ పిఎస్ అహ్మద్ హుస్సేన్ నాయ కత్వంలో ఏఐసిసి అబ్జర్వర్ అజయ్ సింగ్, మాజీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ కమలమ్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. కదిరిలో ఆదివారం నాలుగు గంటలకి ఏసిసి అబ్జర్వర్ నాయ కత్వంలో సమావేశంలో వాట్సాప్ ద్వారా ఫేస్‌బుక్‌ద్వారా ప్రకటన విడుదల చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనాయితుల్ల వెంటనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు సమాచారం లేకుండానే కదిరిలో ఒక సమావేశం ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారని సీనియర్ నాయకులు ఆందోళన చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజవర్గం ఇంచార్జ్‌ని వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఆర్గన సెక్రెటరీ కె ఇందాదుల్లా ఖాన్, పిసిసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పిఎస్ అహ్మద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖుదాబక్ష. చిలుమత్తూరు మోహన్ గాంధీ, ఎన్ బాలకృష్ణ, బాబా ఫరుద్దీన్, రఫీ, శోకత్ అలీ ఖాన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులతో స్థానిక నాయకులు

ఎన్‌సిసితో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్‌సిసిలో చేరి క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకోవడం వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జెయస్‌వియస్ ప్రసాద్, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ ఏ.నాగేంద్ర కుమార్, ఎన్‌సిసి లెఫ్టినెంట్ యమ్.ఆర్.ఫణింద్ర మాట్లాడుతూ ఎన్‌సిసి క్రమశిక్షణకు మారుపేరని, ఎన్‌సిసి వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఆడపిల్లలు ఎన్‌సిసిలో చేరడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌-ఎస్ సమన్వయకర్త బి.రాజన్న, వైస్ ప్రిన్సిపల్ ఈ.అశ్వర్థ నారాయణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకోవడానికి కోసం బిపిఎస్, అక్రమ లే అవుట్లను సక్రమం చేసుకోవడానికి కోసం ఎల్ ఆర్ ఎస్ పథకాలను తీసుకువచ్చిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం మునిసిపల్ కమిషనర్ మల్లికార్జునకోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, అనుమతి లేని నిర్మాణాలను క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం బి పి ఎస్ విడుదల చేసి దానికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. దీనికన్నా ముందే అక్రమ లేఅవుట్లు సక్రమం చేసుకోవడానికి కోసం ఎల్ ఆర్ ఎస్ పథకం తీసుకొచ్చిందన్నారు. ఈ రెండు పథకాలను పుర ప్రజలు సద్వినియోగం చేసుకొని అనుమతి లేని భవనాలు, అదనపు అంతస్తులు, అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకోవాలన్నారు. అదేవిధంగా హిందూపురం పురపాలక సంఘంలో ప్రస్తుతం ఉన్న ఇళ్లకు, నీటి కొళాయి కనెక్షన్లకు భారీగా తేడా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. పురపాలక సంఘంలో దాదాపు 5 వేల వరకు అక్రమ కొళాయి కనెక్షన్లు ఉండవచ్చని అంచనావేశామన్నారు. ప్రత్యేక టీం లు ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించి అక్రమ కనెక్షన్లను గుర్తించడం జరుగుతుందన్నారు. అయితే అధికారులు గుర్తించడం కన్నా ముందే అక్రమ కొళాయి కనెక్షన్ తీసుకున్న వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సక్రమం చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వస్తే కొళాయి కనెక్షన్ కోసం పురపాలక సంఘంలో రూ. 10 వేలు డిపాజిట్ ఉందనిదీనిని చెల్లిస్తే ఆ కుళాయి కలెక్షన్ సక్రమం చేస్తామని చెప్పారు. అదే అధికారులు గుర్తించి అక్రమ కొళాయి కనెక్షన్ అని తేలితే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు డిపాజిట్ మొత్తం తీసుకోవడంతోపాటు వారికి భారీ ఎత్తున జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని టిడిపి ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్రకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో జరుగుతున్న ఏపీ ఎస్.జీ.ఎఫ్ అంతర్ జిల్లా జూడో ఛాంపియనిషిప్ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువ క్రీడాకారులు జాతీయ స్థాయికి చేరుకునే అవకాశాలకు పునాది ఇలాంటివే అవుతాయని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, ఆరోగ్యం పెంపొందుతాయని విద్యార్థులను ఉత్సాహపరిచారు. అదేవిధంగా చిలకం మధుసూదన రెడ్డి సొంత నిధులతో ఫైనల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహేష్ చౌదరి, రాఘవరెడ్డి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని గోళ్లాపురం, గుడ్డంపల్లి గ్రామాలతో పాటు పట్టణంలోని శ్రీకంఠపురంలో ఆదివారం భక్త కనకదాసు జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ బాలాజీ, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్‌తో పాటు వైసిపి నియోజక వర్గ సమన్వ కర్త దీపికా వేణురెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్, కురుబ రాష్ట్ర డైరెక్టర్ పరిమళ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవినహళ్లి ఆనంద్ కుమార్, ఐటిడిపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు మంగేష్, కదిరప్ప, చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి అచ్చెన్నాయుడుతో పుట్టపర్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్, తదితరులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలపై చర్చించి అభివృద్ధి పనుల పైన పాలకవర్గ నిర్ణయాలను తీసుకున్నామన్నారు. వీటికి తక్షణమే నిధులను మంజూరు చేయాలని మంత్రి కోరారు. స్పందించిన మంత్రి మార్కెట్ యార్డ్ కమిటీ కమిషనర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కరుణాకర్, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా క్రీడాకారుడికి నగదు బహుమతి అందజేస్తున్న నాయకులు